శుక్రవారం 19-4-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 310, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




## రాబోయే మూడు రోజులు భానుడు ఉగ్రరూపమే

### మూడు నుంచి ఐదు డిగ్రీలు పెరిగే అవకాశం

**ముందడుగు తెలంగాణ:**

తెలుగు రాష్ట్రాల్లో భానుడు ఉగ్రరూపం చూపిస్తున్నాడు. రాబోయే మూడు రోజులు మూడు నుంచి ఐదు డిగ్రీల వరకు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. గురు, శుక్ర, శనివారాల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని వెల్లడించింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ , సూర్యాపేట, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో వడగాడ్పులు తీవ్రంగా వీయనున్నాయి. ఏపీలో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఆయా జిల్లాలకు చెందిన ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. దీనికి సంబంధించి వాతావరణశాఖ అధికారులు ఎల్లో అలర్ట్ జారీచేశారు.

2015, 2016 సంవత్సరాల్లో ఏపీ, తెలంగాణలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ ఎండలకు భరించలేక ఎంతోమంది మృత్యువాత పడ్డారు. మళ్లీ భానుడు ఇప్పుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. అత్యవసర పనులుంటే బయటకు రావాలని, ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా కచ్చితంగా గొడుగులు వేసుకొని రావాలని, సాధ్యమైనంత వేగంగా పనులు పూర్తిచేసుకొని ఇంటికి తిరిగివెళ్లాలని చెబుతున్నారు. ఆదివారం నుంచి వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయనేది ఇప్పుడే స్పష్టత రాదని, ఈ సంవత్సరం మాత్రం ఎండలు తీవ్రంగా ఉంటాయని, ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.





## ఎన్నికల ప్రక్రియ పవిత్రంగా ఉండాలి

- ఎలాంటి అనుమానాలకు తావివ్వొద్దు
- ఎన్నికల వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**ముందడుగు ఢిల్లీ:**

దేశ వ్యాప్తంగా తొలి దశ ఎన్నికల పోలింగ్ ప్రారంభం అవుతున్న వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల ప్రక్రియ పవిత్రంగా ఉండాలని, దీనిలో ఎలాంటి అనుమానాలకు తావివ్వొద్దని సుప్రీంకోర్టు తెలిపింది. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఈవీఎం ఓట్లతో వీవీప్యాట్ స్లిప్‌లను క్రాస్ వెరిఫై చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత గురించి ఆరా తీసింది. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ పవిత్రంగా ఉండాలని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఆశించినది జరగడం లేదని ఎవరూ భయపడవద్దు అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం పేర్కొంది.

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఇటీవల కేరళలో జరిగిన మాక్ పోల్ గురించి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కాసర్‌గోడ్‌లో మాక్ ఓటింగ్ జరిగిందని.. అక్కడ నాలుగు ఈవీఎంలను వీవీప్యాట్లతో సరిపోలిస్తే బీజేపీకి అదనంగా ఓట్లు వచ్చాయని తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియలో పవిత్రత అవసరం అని.. అనుకున్న విధంగా జరగడం లేదని ఎవరూ ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. పారదర్శక ఓటింగ్ నిర్వహణ కోసం ఎలాంటి విధానాలను పాటిస్తున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. దీంతో ఎన్నికల సంఘం తమ ప్రక్రియను న్యాయస్థానానికి వివరించింది.



## తడిసిన బట్టలు, బికినీతో బస్సు ఎక్కిన మహిళ

### మగవాళ్లు చేస్తే ఊరుకుంటారా అంటూ నెటిజన్ల ప్రశ్నలు

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ ప్రజా రవాణా బస్సులోకి ఓ మహిళ బికినీతో రావడం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. ఈ ఘటనకి సంబంధించిన వీడియోని ట్విట్టర్ (X)లో @DELHIBUSES1 అకౌంట్ నుంచి ఏప్రిల్ 17, 2024న పోస్ట్ చేశారు. బికినీలో వచ్చిన మహిళను చూసిన ఇతర ప్రయాణికులు అవాక్కయ్యారు. "ఈమె ఎవరు ఇలా వచ్చిందేంటి" అని అనుకుంటూ బిత్తరపోయారు. కొంతమంది రామ రామ అనుకుంటూ.. తమ సీట్ల నుంచి లేచి వెళ్లిపోయారు. మరికొందరు.. రోజులు బాలేవు అనుకుంటూ.. తల పక్కకు తిప్పుకున్నారు. ఓ ముసలామె.. అలా వెళ్లి.. ఆ సీట్లో కూర్చో అని ఆ మహిళకు సలహా ఇచ్చింది.

చూశారుగా ఇదీ పరిస్థితి. ఆ మహిళను గమనిస్తే, ఆమె అప్పుడే స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టి వచ్చినట్లు ఉంది. ఆమె జుట్టు, బికినీ కూడా తడిగా ఉంది. అసలు ఆమె అలా ఎలా వచ్చింది? ఎలా బస్ ఎక్కింది? ఎందుకిలా చేసింది? ఇలా ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. ఢిల్లీ రవాణా వ్యవస్థలో డిటిసి బస్సులు కీలకమైనవి. ఢిల్లీ మెట్రో తర్వాత ప్రజలు ఎక్కువగా ఈ బస్సుల్లోనే ప్రయాణిస్తారు. "లా అండ్ ఆర్డర్ ఎక్కడ? ఆమెను ఎలా అనుమతించారు" అని ఓ యూజర్ ప్రశ్నించారు. "మగవాళ్లు ఇలా చేసి ఉంటే.. ఏమయ్యేది" అని మరో యూజర్ ప్రశ్నించారు. "ఎండ 40 డిగ్రీలు ఉంటే.. పరిస్థితి ఇలాగే ఉంటుంది" అని మరో యూజర్ కామెంట్ ఇచ్చారు.

## పాత కేసీఆర్‌ను మళ్లీ చూస్తారు

- ఎన్నికల తర్వాత రాజకీయం గందరగోళం
- రాష్ట్రంలో ఏం జరిగినా బీఆర్ఎస్‌కే మేలు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక వ్యాఖ్యలు

**ముందడుగు హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయం గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఏ రాజకీయ గందరగోళం జరిగినా బీఆర్ఎస్‌కే

మిగతా 2లో



## 22 మంది చేతుల్లోనే దేశ సంపద

- యువత ఉద్యోగాల కోసం పాకులాడుతున్నారు
- రైతులు సాయం కోసం అరుస్తున్నారు
- మోడీ ప్రభుత్వాన్ని నిలదీసినా రాహుల్ గాంధీ

వివరాలు 3లో

ముందడుగు
శుక్రవారం
19-4-2024
హైదరాబాద్

# పాత కేసీఆర్‌ను మళ్లీ చూస్తారు

మొదటిపేజీ తరువాయి

మేలు జరుగుతుంది. ఉద్యమకాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారు. బస్సు యాత్ర రూట్ మ్యాప్ ఇవాళ ఖరారవుతుంది. కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది.. రానున్న రోజులు మనవే. పార్లమెంట్ లో మన గళం వినిపించాల్సిన అవసరం ఉంది. రైతు సమస్యలు అజెండాగా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలి. కొందరు నేతలు పార్టీని వీడి వెళ్లినంత మాత్రానా బీఆర్ఎస్‌కు నష్టం ఏమీ లేదు అని కేసీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి అధినేత కేసీఆర్ సరికొత్త పంథా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఎండిన పంట పొలాలను పరిశీలించడంతో పాటు రోడ్డు షోల్లో పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఉదయం 11 గంటల వరకు పొలం బాట.. సాయంత్రం నుండి ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గంలో 23 చోట్ల రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించనున్నట్లు సమాచారం. సిద్దిపేట, వరంగల్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

# బేబీ ఫుడ్స్‌లో చక్కెర, తేనె వాడుతున్నారు

## వివరణ ఇచ్చిన నెస్లే ఇండియా

**ముందడుగు జాతీయం:**

చిన్న పిల్లలు ఎక్కువగా ఇష్టపడే నెస్లే ఇండియాకు చెందిన బేబీ ఫుడ్స్‌లో చక్కెర, తేనె వంటి పదార్థాలు వినియోగిస్తున్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. స్విట్జర్లాండ్‌కు చెందిన ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ 'పబ్లిక్ ఐ' దీనికి సంబంధించిన కొన్ని అంశాలను బయట పెట్టినట్లు పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. తాజాగా నెస్లే ఇండియా దీనిపై వివరణ ఇచ్చింది. భారత్ సహా కొన్ని పేద దేశాల్లో నెస్లే విక్రయించే బేబీ ఫుడ్స్‌లో చక్కెర వినియోగం అధికంగా ఉంటోందని తమ పరిశోధనలో తేలినట్లు పబ్లిక్ ఐ పేర్కొంది. భారత్‌తో పోలిస్తే థాయ్‌లాండ్, ఇథియోపియాలో చక్కెర వినియోగం మరింత ఎక్కువగా ఉంటున్నట్లు తన నివేదికలో తెలిపింది. తమ ఆహార ఉత్పత్తుల్లో చక్కెర వినియోగం గురించి వచ్చిన ఈ ఆరోపణలపై నెస్లే ఇండియా స్పందించింది. గడిచిన ఐదేళ్లుగా చక్కెర వినియోగాన్ని 30 శాతం మేర తగ్గించినట్లు ఆ కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు. ఈ మేరకు పీటీఐ వార్తా సంస్థకు వివరణ ఇచ్చారు. ఎప్పటికప్పుడు తమ ఉత్పత్తులను సమీక్షించుకుంటున్నామని తెలిపారు. నాణ్యత, రుచిలో విషయంలో రాజీ పడకుండా వీలైనంత వరకు చక్కెర స్థాయిలను మరింత తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వార్తల నేపథ్యంలో గురువారం నెస్లే ఇండియా షేరు ఓ దశలో 5 శాతం మేర క్షీణించింది. చివరికి 2.95 శాతం నష్టపోయి రూ.2,471 వద్ద ముగిసింది.

# కావాలనే మామిడిపండ్లు, స్వీట్లు తింటున్నారు

## కేజ్రీవాల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపణలు




**ముందడుగు జాతీయం:**

ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా మామిడిపండ్లు, స్వీట్లు తింటున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. టీలో ఎక్కువ పంచదార వంటి చర్యల ద్వారా షుగర్ లెవల్స్ పెంచుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని విమర్శించింది. తన బ్లడ్ షుగర్ లెవల్స్ హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని అరవింద్ కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తన షుగర్ లెవల్‌స్‌ను నిరంతరం పర్యవేక్షించాలని, వారానికి మూడు సార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన వైద్యుడ్ని సంప్రదించేందుకు అనుమతించాలని కోరుతూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈడీ తరుపు న్యాయవాది జోహెబ్ హొస్సేన్ కోర్టులో వాదనలు వినిపించారు. షుగర్ లెవల్స్ పెంచుకునేందుకు కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా మామిడిపండ్లు, స్వీట్లు తింటున్నారని ఆరోపించారు. షుగర్ లెవల్స్ హెచ్చుతగ్గుల సాకుతో బెయిల్ కోరేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని కోర్టుకు తెలిపారు. మరోవైపు ఈడీ న్యాయవాది జోహెబ్ వ్యాఖ్యలపై అరవింద్ కేజ్రీవాల్ తరపు న్యాయవాది వివేక్ జైన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మీడియాను ఆకట్టుకునేందుకు ఈడీ ఇలాంటి ప్రకటనలు చేస్తోందని ఆరోపించారు. కేజ్రీవాల్ పిటిషన్‌ను ఉపసంహరించుకుని సరైన పిటిషన్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. దీంతో కేజ్రీవాల్ డైట్‌కు సంబంధించి మెడికల్ రిపోర్ట్ ఇవ్వాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.



# ఏపీలో నాలుగు బహిరంగసభల్లో మోడీ

## ప్రకటించిన కూటమి నేతలు


**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**

దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు ప్రచార వేగం పెంచాయి. ఏపీలో నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్డీఏ కూటమి నేతలు కూడా దూకుడు పెంచారు. 3 పార్టీల నేతలు కలిసి పాల్గొన్న సభలకు ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో ఉమ్మడిగా నిర్వహించే సభలపై ప్రణాళిక రూపొందిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో నాలుగు బహిరంగ సభల్లో పాల్గొంటారని కూటమి నేతలు చెబుతున్నారు. బిజెపి అభ్యర్థులు పోటీ చేస్తున్న అనకాపల్లి, రాజమహేంద్రవరం, కడప లేదా రాజంపేట, మరో నియోజకవర్గంలో ఏర్పాటు చేసే సభల్లో మోడీతో పాటు, తెదేపా అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ పాల్గొంటారని సమాచారం. ఈలోగా వీలైనన్ని సభల్లో ఉమ్మడి ప్రచారం చేయాలని చంద్రబాబు, పవన్ నిర్ణయించారు. ఈనెల 24న రాయలసీమలోని రాజంపేట, రైల్వే కోడూరు సభల్లో ఇద్దరు నేతలు పాల్గొననున్నారు. 19న ఆలూరు, రాయదుర్గం, 20న గూడూరు, సర్వేపల్లి, సత్యవేడు ప్రజాగళం సభల్లో చంద్రబాబు పాల్గొననున్నారు.

# భారతదేశంలో పేదరికం తగ్గిపోయింది

- 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

**ముందడుగు జాతీయం:**



దేశంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు వాగ్దానాలు చేస్తుంటదని, బీజేపీ మాత్రం ఇచ్చిన హామీలను అమలుచేసి చూపించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా సీఎన్ బీసీ ఆవాజ్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఎవరు వాగ్దానాలు చేస్తున్నారు.. ఎవరు వాటిని అమలు చేస్తున్నారనేది ప్రజలు చూస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం మాత్రం కరోనా వంటి క్లిష్ట పరిస్థితులను ఎదర్కొంటూ కూడా దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశారన్నారు. ఎడ్యుకేషన్, హెల్త్ కేర్, ఫుడ్, వంటి పలు విషయాల పట్ల మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆధారంగా పేదరికం తగ్గిందని.. అంతేకానీ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రతి ఏటా రూ,1 లక్ష రూపాయలు ఇవ్వడం ద్వారా పేదరికం అంతం కాదని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణ మాఫీ వాగ్దానం.. దేశంలోని కనీసం 50 శాతం రైతులకు కూడా సహాయపడదని అన్నారు.

మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం..రైతులకు అనేక రకాలుగా సహాయమందిస్తోన్నారు. రైతుల ఆదాయం మెరుగుపడుతుందని, రైతులకు మార్కెట్ అందుబాటుపై ఫోకస్ పెట్టామని, రైతుల కోసం విస్తృతంగా మార్కెట్లు ఏర్పాటు చేయడంపై మోదీ ఫోకస్ పెట్టారని తెలిపారు. భారత్ లో సంస్థలు ఏర్పాటు చేసి,ఉత్పత్తులను మ్యానుఫ్యాక్చరింగ్ చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్నికంపెనీలను, ఎంటర్ ప్రెన్యూర్ లను ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలకు.. భారత్ లో స్కిల్స్, మ్యాన్ పవర్, కాస్ట్ అడ్వాంటేజ్ ఉన్నట్లు తెలిపారు. ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుముఖం పడుతుందని, మోదీ ప్రభుత్వం 10లక్షల ప్రభుత్వ ఉద్యోగాల అపాయింట్ మెంట్ లెటర్స్ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. డెవలప్ మెంట్, పేదరికం తగ్గింపు,సామాజిక ఎదుగుబాటు విషయాల్లో ప్రధాని మోదీ ఫర్ఫార్మెన్స్ రికార్డ్ ఫర్ఫెక్ట్ గా ఉన్నట్లు తెలిపారు.

# మహిళా రెజ్లర్ల ఆరోపణల్లో నిజం లేదు

## వారు చెప్పిన తేదీల్లో నేను దేశంలో లేను • మరింత విచారణ జరపాలని బ్రిజ్ భూషణ్ పిటీషన్

**ముందడుగు జాతీయం:**

మహిళా రెజ్లర్లు తనపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని బ్రిజ్ భూషణ్ పిటీషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మరింత విచారణ జరపాలని కోరుతూ బ్రిజ్ భూషణ్ పిటీషన్ దాఖలు చేశారు. జాతీయ రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై నమోదైన లైంగిక వేధింపుల కేసు వ్యవహారంలో ఢిల్లీ కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసులో నేడు తీర్పు వెలువరించాల్సి ఉంది.



2022 సెప్టెంబరు 7న డబ్ల్యూఎఫ్ఐ కార్యాలయానికి వెళ్లినప్పుడు నేరం జరిగిందని రెజర్లు ఆరోపిస్తున్నారు. కానీ, వారు చెప్పిన తేదీల్లో తాను అసలు దేశంలోనే లేనప్పుడు నేరం ఎలా జరుగుతుందన్నారు. ఈ కేసులో ప్రస్తుతం వారి నాటి కాల్ డిటైల్ రికార్డ్స్‌పై తాను ఆధారపడినట్లు తెలిపారు. అయితే, పోలీసులు మాత్రం ఈ సీడీఆర్‌ను రికార్డుల్లో చూపించలేదని ఆయన తరఫున న్యాయవాది పిటీషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మరింత విచారణ జరపాలని కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి.. ఏప్రిల్ 26కు వాయిదా వేశారు. బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని దేశంలోని ప్రముఖ మహిళా రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రెజ్లింగ్ వ్యవహారాల నుంచి బ్రిజ్ భూషణ్ రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ కేసుపై న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది.

ముందడుగు
శుక్రవారం
19-4-2024
హైదరాబాద్

# 22 మంది చేతుల్లోనే దేశ సంపద



**ముందడుగు జాతీయం:**

మన దేశంలోని కేవలం 22 మంది సంపన్నుల చేతుల్లో 70 కోట్ల మంది మన దేశ ప్రజల ఆస్తులకు సమానమైన సంపద పోగుపడిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే మనం సూపర్ పవర్ కావడం గురించి ఎలా మాట్లాడతామని ప్రశ్నించారు. కేరళలోని కొట్టాయంలో గురువారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ మన రైతులు సాయం కోసం అరుస్తున్నారని, యువత ఉద్యోగాల కోసం పాకులాడుతున్నారని, ఈ పరిస్థితిల్లో మనం సూపర్ పవర్ కాగలమా అని మోడీ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇక దేశ ప్రజలపై ఒకే చరిత్ర, ఒకే జాతి, ఒకే భాషను రుద్దాలని బీజేపీ కోరుకుంటోందని రాహుల్ గాంధీ అంతకుముందు దుయ్యబట్టారు. కేరళలోని కన్నూర్‌లో ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ కాషాయ పార్టీపై విమర్శలు గుప్పించారు.

భారత్ వైవిధ్యతను కాంగ్రెస్, యూడీఎఫ్ ఆమోదిస్తాయని, తాము భిన్న భాషలను, భిన్న సంస్కృతులను, భిన్న చరిత్రను గౌరవిస్తామని చెప్పారు. దేశ ప్రజల భిన్నమైన భావాలను గుర్తెరిగి అంగీకరిస్తామని అన్నారు. ఉదాహరణకు కేరళ నుంచి మళయాళాన్ని తొలగిస్తే రాష్ట్రంలోని మహిళ తన పిల్లలకు ఈ భూమి గొప్పతనం గురించి ఎలా వివరించగలదని రాహుల్ ప్రశ్నించారు. అందుకే భిన్న భాషలు, సంస్కృతులు, చరిత్రను తాము ఆమోదిస్తామని వివరించారు. ఇందుకు విరుద్ధంగా కాషాయ పార్టీ భిన్న మతాలు, భాషలు, సంస్కృతుల మధ్య చిచ్చు రేపి రాజకీయ లబ్ధికి పాకులాడుతోందని విమర్శించారు.




# రూ.27 అదనంగా వసూలు చేసిన ఉబర్

## రూ.28,000 జరిమానా విధించిన వినియోగదారుల ఫోరం

**ముందడుగు జాతీయం:**

ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబర్ ఇండియా ఒక ప్రయాణికుడి నుంచి క్యాబ్ డ్రైవర్ రూ.27 అదనంగా తీసుకుంది. దీనికి ఉబర్ ప్రయాణికుడు జిల్లా వినియోగదారుల కమిషన్ ఆశ్రయించాడు. అదనంగా తీసుకున్న రూ.27తో పాటు ఫిర్యాదుదారు రిత్విక్‌గార్గ్‌కు రూ.5,000 పరిహారం, రూ.3,000 ఖర్చుల కింద చెల్లించాలని ఉబర్ ఇండియాను కమిషన్ ఆదేశించింది. అలాగే భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలను అడ్డుకునేందుకు కమిషన్ లీగల్ ఎయిడ్ ఖాతాలో రూ.20,000 జమ చేయాలని తెలిపింది. కస్టమర్ల సమయాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదారంగా వ్యవహరించాల్సింది పోయి.. ఇలా వ్యవహరించడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేసింది.

పంజాబ్‌కు చెందిన గార్గ్.. 2022 సెప్టెంబరు 19న చండీగఢ్‌లో క్యాబ్ బుక్ చేసుకున్నారు. ఆ సమయంలో యాప్‌లో ఛార్జీ రూ.53గా చూపించింది. డ్రైవర్ మాత్రం ఏవేవో నిబంధనలు చెప్పి రూ.80 వసూలు చేశాడు. ఈ విషయాన్ని లీగల్ నోటీసులు, మెయిల్స్ ద్వారా ఉబర్ ఇండియా దృష్టికి తీసుకెళ్లగా కంపెనీ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చింది. ఉబర్ ఇండియా సమాధానంపై కమిషన్ తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. డ్రైవర్ అధికంగా వసూలు చేస్తున్నాడని తెలిసి కూడా అతనిపై ఎలాంటి చర్య తీసుకోలేదని తేల్చింది. కస్టమర్ చెల్లించే డబ్బుల్లో కొంత ఉబర్‌కు వెళ్తున్న నేపథ్యంలో కచ్చితంగా బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేసింది. డ్రైవర్ల ప్రవర్తన సక్రమంగా ఉందో, లేదో తెలుసుకోవాల్సిన బాధ్యత కంపెనీదేనని తేల్చి చెప్పింది.

# ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్స్

- ఈ హెల్‌మెట్స్ లో పలు రకాల ఫీచర్లు
- దాదాపుగా 8 గంటల వరకూ కూలింగ్



**ముందడుగు గుజరాత్:**

దేశవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. నిత్యం రోడ్డుపై నిల్చొని వాహనాలను కంట్రోల్ చేసే ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ట్రాఫిక్ పోలీసులు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు గుజరాత్ రాష్ట్రం వడోదరా ట్రాఫిక్ పోలీసులు ఓ ఉపాయం ఆలోచించారు. ఇందులో భాగంగానే ఎయిర్ కండిషనర్స్‌తో కూడిన హెల్‌మెట్స్‌ను పరిచయం చేశారు. 40 - 42 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతల సమయంలో శీతలీకరణ ఉపశమనాన్ని అందించేందుకు ఈ ఏసీ హెల్మెట్స్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. ఈ హెల్‌మెట్స్‌లో పలు రకాల ఫీచర్లు ఉన్నాయి. ఇవి సూర్యకాంతి నుంచి కళ్లకు రక్షణ ఇస్తాయి కూడా. ఇక ఇవి పూర్తిగా ఛార్జింగ్‌తో నడుస్తాయి. వీటికి ఒక్కసారి ఫుల్ ఛార్జింగ్ పెడితే.. దాదాపుగా 8 గంటల వరకూ కూలింగ్‌ను అందించగలవు.

ప్రయోగాత్మంగా ఈ హెల్మెట్స్‌ను వడోదరా ట్రాఫిక్ పోలీసు డిపార్ట్‌మెంట్ ప్రవేశపెట్టింది. వీటిని పెట్టుకుని పలువురు ట్రాఫిక్ కాప్స్ రోడ్డుపై విధులు నిర్వహిస్తున్న వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన కొందరు మంచి ఆలోచన అంటూ వడోదరా ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌ను పొగుడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ట్రాఫిక్ విభాగాలు కూడా ఈ విధానాన్ని అనుసరిస్తే బాగుంటుంది అంటూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

# జగన్‌పై దాడి చేసిన అనుమానితుడు అరెస్ట్

## వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు

**ముందడుగు విజయవాడ:**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌పై రాయిదాడి కేసులో అనుమానితుడిని విజయవాడ అజిత్‌సింగ్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం యువకుడిని కోర్టులో హాజరుపర్చారు. సీఎంపై రాయి విసిరింది అతనేనని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు పోలీసులు సింగ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే.
మరో వైపు.. రాయి దాడి వ్యవహారంపై విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలైంది. పోలీసుల అదుపులో ఉన్న ఆరుగురి వివరాలు తెలపాలంటూ న్యాయవాది సలీం ఈ పిటిషన్ వేశారు. న్యాయవాది కమిషనర్‌ను నియమించాలని పేర్కొన్నారు. ఇంకెవరిని ఇరికిస్తారో అనే భయంతో కాలనీ వాసులు కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. రెండు, మూడు వీధులు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో పోలీసుల అదుపులో ఉన్న అనుమానితుల వివరాలు తెలపాలంటూ న్యాయవాది సలీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్

**ముందడుగు హైదరాబాద్:**




ఇంటర్నేషనల్ ఛాంబర్స్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ నేషనల్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు ఎస్ఎంఈ ఛాంబర్స్ ఆఫ్ ఇండియా సలహాదారు డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ ఇటీవల గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు సంపాదించి అవార్డు పొందడంతో అద్భుతమైన మైలురాయిని సాధించారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని రోడ్ నంబర్ 45లోని చబ్బీ చో రెస్టారెంట్‌లో అజయ్ అగర్వాల్ సక్సెస్ మీట్‌ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మరియు రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ చైర్మన్ అజయ్ మిశ్రా హాజరయ్యారు.
డా. అజయ్ అగర్వాల్ పేరు ది థికెస్ట్ బుక్ ఆఫ్ గిన్నిస్ వరల్డ్ రికార్‌డ్స్‌లో 23 మంది పాజిటివ్ ఛేంజ్ మేకర్స్ ఇన్ ది వరల్డ్ 2023లో చేర్చబడింది. లండన్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వహించిన ఈ అవార్డు ప్రదానోత్సవం లండన్ లోని ప్రతిష్టాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగింది. అజయ్ అగర్వాల్ సర్టిఫికేట్ మరియు అవార్డు విజేతల ప్రొఫైల్‌లతో కూడిన పుస్తకాన్ని నిర్వాహక కమిటీ నుండి ఇటీవలే అందుకున్నారు. పబ్లిక్ రిలేషన్స్, రైటింగ్, మోటివేషనల్ స్పీకింగ్ మరియు సోషల్ యాక్టివిటీస్‌లో అగర్వాల్ అనేక జాతీయ మరియు అంతర్జాతీయ అవార్డులతో సత్కరించబడ్డారు. అతను పిఆర్ మెజీషియన్‌గా విస్తృతంగా గుర్తింపు పొందాడు.



# జీహెచ్ఎంసీ పరిధిలో కరెంట్ తెగ వాడుతున్నారు

## మే నెలలో విద్యుత్ మరింత పెరిగే అవకాశం

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిపోతోంది. గురువారం మధ్యాహ్నం రికార్డు స్థాయిలో 4,053 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ మైలురాయిని అధిగమించిది. 2023 ఏప్రిల్ 18న గరిష్ఠ డిమాండ్ 3,471 మెగావాట్లు. గతేడాదితో పోల్చితే ప్రస్తుతం 582 మెగావాట్ల డిమాండ్ పెరిగినప్పటికీ అధికారులు ఏలాంటి అంతరాయం లేకుండా నిరంతరం సరఫరా చేశారు. అన్ని కేటగిరీల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తున్న విద్యుత్ శాఖకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మల్లు అభినందనలు తెలిపారు. మేనెలలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ సిబ్బంది, అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాగే సేవలందించి వినియోగదారుల మన్ననలు పొందాలని సూచించారు.

ముందడుగు
శుక్రవారం
19-4-2024
హైదరాబాద్

# గూగుల్ పే రూ.15,000 రుణం ఇస్తోంది

## ఆ రుణం ఏలా తీసుకోవాలో తెలుసుకొండి

**ముందడుగు ప్రత్యేకం**

అవసరం, అత్యవసరం ఉన్నవారికి చాలా సంస్థలు రుణం ఇస్తున్నాయి. ఈ జాబితాలో ఇప్పుడు గూగుల్ పే కూడా చేరింది. ఇందుకోసం శాచెట్ లోన్ అనే ప్లాన్ తెచ్చింది. దీని ద్వారా చిన్న తరహా వ్యాపారులు.. రూ.15,000 వరకూ లోన్ తీసుకోవచ్చు. ఈ మనీని వ్యాపారులు ePayLater ద్వారా పొందవచ్చు. అది ఎలాగో తెలుసుకుందాం.

### ఈ లోన్ అర్థమేంటి..?

గూగుల్ పే వాడే వారికి ఈ లోన్ ఇచ్చేందుకు.. ఈ కంపెనీ.. డిఎంఐ ఫైనాన్స్‌తో చేతులుకలిపింది. ఇది చిన్న వ్యాపారులకు అనుకూలమైన లోన్. యూపిఐ ద్వారా ఈ లోన్ పొందేందుకు గూగుల్ పే కంపెనీ... ఐసిఐసిఐ బ్యాంకుతో చేతులు కలిపింది. గూగుల్ పే ద్వారా పర్సనల్ లోన్లు ఎక్కువ మంది పొందేందుకు ఈ కంపెనీ.. యాక్సిస్ బ్యాంకుతో కూడా భాగస్వామ్యం కుదుర్చుకుంది. గూగుల్ పే ఇచ్చే రుణంపై వడ్డీ రేటు సంవత్సరానికి 14 శాతం నుంచి 36 శాతం వరకూ ఉంటుంది. 18 ఏళ్లు, ఆపై ఉన్నవారికే ఈ లోన్ ఇస్తారు. ఈ లోన్ పొందేందుకు ఎలాంటి ఆదాయమూ అవసరం లేదు. ఐతే.. ప్రాసెసింగ్ ఫీజు 5% + GST ఉంటుంది. ఈ రుణాన్ని తక్కువలో తక్కువ రూ.111 చొప్పున కూడా చెల్లించవచ్చు.




### లోన్ అర్హతలు

భారతీయ పౌరుడు అయివుండాలి. వయసు 18 ఏళ్లకు పైగా ఉండాలి. ఇదివరకు తీసుకున్న అప్పులేవీ చెల్లించకుండా ఉండకూడదు. మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, పాన్ కార్డు ఉండాలి. దరఖాస్తు దారు సిబిల్ స్కోర్ కనీసం 750 ఉండాలి.

### లోన్ దరఖాస్తు విధానం

**ఈ లోన్ పొందేందుకు డిజిటల్ డాక్యుమెంట్లు అవసరం. ముందుగా గూగుల్ పే బిజినెస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత లోన్ సెక్షన్ లోకి వెళ్లాలి. అక్కడ ఆఫర్ ట్యాప్‌ని పరిశీలించి, లోన్ ఆప్షన్ ఎంచుకోవాలి. అక్కడ మీరు గూగుల్ పే శాచెట్ లోన్ ఎంచుకొని ఎంత రుణం కావాలో వివరాలు ఇవ్వాలి. తర్వాత KYC పూర్తి చెయ్యాలి. చివరిగా టెర్మ్స్ అండ్ కండీషన్స్ చదివి.. సబ్‌మిట్ క్లిక్ చెయ్యాలి. మీరు రుణం ఎప్పటిలోగా చెల్లిస్తారో వివరాలు ఇవ్వొచ్చు. అంతా అయ్యాక మీకు ఒక OTP వస్తుంది. అది ఎంటర్ చెయ్యగానే, మీ దరఖాస్తు విజయవంతంగా సబ్‌మిట్ చేసినట్లవుతుంది. మీరు దరఖాస్తు పంపిన కొన్ని నిమిషాల్లోనే గూగుల్ పే నుంచి మీరు ఇచ్చిన బ్యాక్ అకౌంట్‌లోకి లోన్ వస్తుంది. ఐతే.. ప్రాసెసింగ్ ఫీజు + GST వంటి ఛార్జీలను మినహాయించుకొని, మిగతా అమౌంట్‌ను ఇస్తుంది. ఈ మొత్తం ప్రక్రియలో ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. ఈ లోన్‌ని గూగుల్ డైరెక్టుగా ఇవ్వదు. ఇది మధ్యవర్తిలాగా వ్యవహరిస్తుంది. మీరు చెల్లించాల్సిన డబ్బు.. ప్రతీ నెలా ఆటోమేటిక్‌గా మీ అకౌంట్ నుంచి తగ్గుతూ ఉంటుంది.**



# ఫ్రిజ్‌లో నీటిని నేరుగా తాగితే ప్రమాదం

## ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది

**ముందడుగు ప్రత్యేకం:**

ఒకపక్క ఎండలు మండిపోతున్నాయి.. గొంతుఆరిపోతుంది.. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. చల్లటి ఫ్రిడ్జ్ నీళ్లు దొరుకుతే అదే పదివేలు అనుకుంటారు. ప్రజలు కూడా ఎండాకాలం రాగానే సాధారణంగా వాటర్ బాటిళ్లను ఫ్రిజ్ లో ఉంచడం మొదలుపెడతారు. తద్వారా దాహం వేసినప్పుడల్లా.. ఫ్రిడ్జ్ లోని వాటర్‌ను బయటకు తీసి తాగడం ప్రారంభిస్తారు. అయితే ఫ్రిజ్‌లోని నీటిని నేరుగా తాగడం ఆరోగ్యానికి ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా.. అసలు ఫ్రిడ్జ్ వాటర్ తాగకుండా ఉండటమే మేలని పేర్కొంటున్నారు.

### ఆరోగ్యంపై ప్రభావం..

ఎండాకాలంలో రిఫ్రిజిరేటర్ నుంచి తీసిన చల్లటి నీటిని తాగడం వల్ల ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుందని.. మీకు కూడా అలాంటి అలవాటు ఉంటే ఈరోజే మార్చుకోవాలని సూచిస్తున్నారు. ఎందుకంటే కూల్ వాటర్ శరీరానికి ప్రమాదకరంగా మారవచ్చు. రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల ఊబకాయం పెరగడమే కాకుండా అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

### గుండె సమస్యలు

చల్లటి నీరు తాగడం వల్ల గుండెకు చాలా హాని కలుగుతుంది. దీని కారణంగా, రక్త నాళాలు కుంచించుకుపోతాయి. రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది. చల్లటి నీరు తాగడం వల్ల రక్తనాళాలు చాలా గట్టిపడతాయి.. దీంతో గుండె సమస్యలు మొదలవుతాయి.

### ఊబకాయాన్ని పెంచుతుంది

చల్లటి నీరు తాగడం వల్ల శరీరంలోని కొవ్వు నెమ్మదిగా పెరుగుతుంది.. స్థూలకాయాన్ని తగ్గించుకోవడంలోనూ, కొవ్వును కరిగించుకోవడంలోనూ చాలా కష్టాలు మొదలవుతాయి. మీరు బరువు తగ్గాలనుకుంటే చల్లటి నీరు అస్సలు తాగకండి. సాధారణ లేదా గోరువెచ్చని నీరు త్రాగాలి.

### చల్లటి నీటితో జీర్ణశక్తి దెబ్బతింటుంది

చల్లటి నీరు తాగడం వల్ల జీర్ణశక్తి పూర్తిగా పాడవుతుంది. అటువంటి పరిస్థితిలో, ఫ్రిజ్ లోని చల్లని నీరు త్రాగకుండా ప్రయత్నించండి. ఇది జీర్ణక్రియను దెబ్బతీసి మలబద్ధకం సమస్యను పెంచుతుంది.

# నా ఎనర్జీకి కారణం సెక్స్

## రిపోర్టర్ ప్రశ్నకు మహువా మొయిత్రా సమాధానం



**ముందడుగు :**

తృణముల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహువా మొయిత్రాకు ఫైర్ బ్రాండ్ అనే పేరు ఉంది. డబ్బులు, గిఫ్ట్‌లు తీసుకుని.. పార్లమెంటులో ప్రశ్నలు అడిగారని నమోదైన కేసులో ఆమె లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ప్రస్తుతం మరోసారి టీఎంసీ పార్టీ తరఫున టికెట్ పొందిన మహువా మొయిత్రా.. ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా ఆమెను రిపోర్టర్ ఓ ప్రశ్న అడగ్గా.. మహువా మొయిత్రా ఇచ్చిన సమాధానం విని.. ఆ రిపోర్టర్ షాక్ అయ్యాడు. ఇంత ఎనర్జీగా ఉంటారు.. అసలు మీ ఎనర్జీకి కారణం ఏంటి అని ఓ రిపోర్టర్ ప్రశ్నించగా.. నవ్వుతూ సెక్స్ అంటూ మహువా మొయిత్రా సమాధానం ఇచ్చారు.మహువా మొయిత్రా ఇచ్చిన సమాధానంతో ఆ రిపోర్టర్ మాత్రమే కాకుండా అక్కడ ఉన్నవారు అంతా ఒక్కసారిగా షాక్ అయ్యారు. రిపోర్టర్ ప్రశ్న అడగడమే ఆలస్యం.. ఆమె తడబడకుండా ఠక్కున సమాధానం చెప్పడంతో అక్కడ ఉన్నవారికి ఏం జరుగుతుందో ఒక్క క్షణం అర్థం కాలేదు. ఈ ప్రశ్న, జవాబుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. మహువా మొయిత్రా చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన మహువా మొయిత్రా.. ఈసారి కూడా అదే నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు.